కాంగ్రెస్ పాలన.. గాడితప్పింది

నిన్న లేని నీటి సమస్య.. నేడు ఎందుకు వచ్చింది..!

- జంటనగరాల ప్రజలకు సుపరిచితుడిని
- నా పనితీరు అందరికీ తెలుసు
- గెలుపు ఖాయం.. మెజార్టీయే ముఖ్యం
- రెండు, మూడవ స్థానం కోసమే కాంగ్రెస్, బీజేపీ పోటీ
- కిషన్ రెడ్డి ఏం చేశాడని.. ఓట్లు అడుతున్నడు
- త్వరలోనే నగరంలో.. కేటీఆర్, హరీశ్‌రావు రోడ్‌షోలు
- ఎన్నికల ప్రచారంలో సికింద్రాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు గౌడ్

ముషీరాబాద్‌లో సోమవారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న అభ్యర్థి పద్మారావు గౌడ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

కవాడిగూడలో ఎన్నికల ప్రచారం నిర్వహించిన పద్మారావు గౌడ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్, ఏప్రిల్ 22 : ఢిల్లీలో తెలంగాణ వాణి వినిపించాలంటే పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని బలపర్చాలని ఆ పార్టీ సికింద్రాబాద్ నియోజకవర్గం అభ్యర్థి తీగుళ్ల పద్మారావు గౌడ్ అన్నారు. తెలంగాణ ఉద్యమంలో చురుకుగా వ్యవహరించిన తనకు పార్లమెంటు సభ్యుడిగా అవకాశం ఇస్తే రాష్ట్ర సమస్యలపై గళమెత్తుతానని అన్నారు. జంటనగరాల ప్రజలకు సుపరిచితుడనైన తాను, నాలుగు దఫాలుగా ఎమ్మెల్యేగా, మంత్రి, డిప్యూటీ స్పీకర్‌గా చేసిన సేవలు, అభివృద్ధిని గమనించి గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఆయన ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌తో కలిసి కవాడిగూడ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి నేరుగా ఓటర్లను కలుస్తూ పార్లమెంటు ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా పద్మారావు మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో ప్రజల నుంచి విశేష స్పందన వస్తుందని, కాంగ్రెస్ ప్రభుత్వ పాలనను చూస్తున్న ప్రజలు కేసీఆర్ పాలనను గుర్తు చేసుకుంటున్నారని తెలిపారు. ప్రజల్లో ఉండి వారి సమస్యలు పరిష్కరించే సత్తా బీఆర్ఎస్ పార్టీకే ఉన్నదని, ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఎవరూ పోటీకారని, రెండు, మూడవ స్థానం కోసం పోటీ పడుతున్నారని అన్నారు. బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి సికింద్రాబాద్ నియోజకవర్గానికి ఏం చేశారో అందరికీ తెలుసునని, ప్రస్తుత ఎంపీ ఎక్కడ పోయారని అడుగుతున్నారంటే పని ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చునని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా పాలనను పట్టించుకోవడం లేదని, ఎంతసేపు తమ పార్టీ అధినేత కేసీఆర్, కేటీఆర్‌లపై విమర్శించడమే లక్ష్యంగా పెట్టుకున్నారని మండిపడ్డారు. ప్రజల కోసం పని చేసే విధానాన్ని తెలుసుకొని కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వెళ్తే బాగుంటుందని హితవు పలికారు.

కాంగ్రెస్ పాలన గాడితప్పుతుంది

కాంగ్రెస్ వచ్చిన తరువాత నగరంలో నీటి కొరత, కరెంటు కొతలు మొదలయ్యాయని, పాలన గాడి తప్పుతుందని పద్మారావుగౌడ్ ఆరోపించారు. గత పదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఎక్కడా తాగు నీటి కొరత రానివ్వకుండా చూసుకున్నదని, కాంగ్రెస్‌కు సరైన ప్లానింగ్ లేకపోవడంతోనే తాగునీటి ఇబ్బందులు మొదలై ప్రజలు తాగు నీటి కోసం ఇబ్బందిపడే పరిస్థితి వస్తుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్ ముషీరాబాద్ నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి ప్రజలకు తెలుసునని, పార్లమెంటు ఎన్నికల్లో అదే ప్రజాదరణ కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో నగర ప్రజలు బీఆర్ఎస్‌కు భారీ మెజారిటీ కట్టబెట్టారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా బాధ్యతాయుతంగా పని చేస్తామన్నారు. ఎన్నికల చివరి దశలో తమ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్‌రావు ఎన్నికల ప్రచారం, రోడ్ షోలు నిర్వహిస్తారని చెప్పారు.

ముషీరాబాద్‌లో భారీ మెజార్టీ : ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని, చేసిన అభివృద్ధి పార్లమెంటు ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థికి భారీ మెజార్టీ కట్టబెట్టడానికి దోహదపడుతుందన్నారు. ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు గౌడ్‌కు అత్యధిక మెజారిటీ కట్టబెడతామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ముఠా జయసింహ, ఎడ్ల హరిబాబు యాదవ్, వల్లాల శ్రీనివాస్, శ్యామ్ యాదవ్, వై.శ్రీనివాస్, బి.శ్రీనివాస్‌రెడ్డి, మాదవ్, ముచ్చకుర్తి ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

పజ్జన్నను గెలిపిద్దాం..!

ప్రచారం చేస్తున్న ప్రభాకర్, అంజయ్యచారి, సురేశ్‌గౌడ్, బుచ్చిరెడ్డి

కాచిగూడ, ఏప్రిల్ 22 :పేదల సంక్షేమం కోసం పాటుపడే బీఆర్ఎస్‌కే పట్టం కట్టి, పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని గోల్నాక డివిజన్ బీఆర్ఎస్ నాయకుడు ప్రభాకర్ ముదిరాజ్ కోరారు. బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌ను గెలిపించాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు పడకంటి అంజయ్యచారి, సురేశ్‌గౌడ్, బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో గోల్నాక డివిజన్‌లోని పలు బస్తీలలో సోమవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ ముదిరాజ్ మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని, కార్యకర్తలు ఆ పథకాలను ప్రతి గడపకు తీసుకువెళ్లి పద్మారావుగౌడ్‌ను గెలుపించాలని సూచించారు. తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించి, నిత్యం ప్రజా సంక్షేమం కోసం పాటుపడే బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్ గెలుపునకు నాయకులు, కార్యకర్తలు సహకరించాలని పిలుపునిచ్చారు.

కేసీఆర్ హయాంలోనే అభివృద్ధి

మెహిదీపట్నం, ఏప్రిల్ 22 : రాష్ట్రంలో బీఆర్ఎస్ గెలుపును ఎవరూ అడ్డుకోలేరని నాంపల్లి నియోజకవర్గం మెహిదీపట్నం డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు మెట్టు నట్‌రాజ్ అన్నారు. సోమవారం మెహిదీపట్నంలో సికింద్రాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి టి.పద్మారావు గౌడ్ తరపున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ సీఎంగా రాష్ట్రాన్ని ఎంతో అభివృద్ధి చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ప్రజలకు చేసిందేమీలేదని, ప్రజల్లో కాంగ్రెస్ పార్టీపై తీవ్ర వ్యతిరేకత ఉన్నదని పేర్కొన్నారు.



మెహిదీపట్నంలో సికింద్రాబాద్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి టి.పద్మారావు తరపున ప్రచారం నిర్వహిస్తున్న డివిజన్ అధ్యక్షుడు మెట్టునట్‌రాజ్

కార్వాన్ నియోజకవర్గం గోల్కొండ పీఎస్ మైత్రి, పీస్ కమిటీ సభ్యులు, సంఘ సేవకులు, ఇబ్రహింబాగ్ బస్తీ సంక్షేమ సంఘం నాయకులు వినాయక దయానంద్ కూతురు సాయిప్రీతి వివాహం సికింద్రాబాద్‌కు చెందిన వినయ్‌కుమార్‌తో నార్సింగ్‌లోని ఓం కన్వెన్షన్ సెంటర్‌లో జరిగింది. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్, జియాగూడ మాజీ కార్పొరేటర్ మిత్ర కృష్ణ, మైత్రి, గోల్కొండ మైత్రి, పీస్ కమిటీ అధ్యక్షుడు సిరుగుమల్లె రాజువస్తాద్‌తో కలిసి వధూ వరులను ఆశీర్వదించారు.

- అబిడ్స్

క్యాన్సర్‌తో బాధపడుతున్న విద్యార్థికి ఆర్థిక సాయం

టోలిచౌకి షేక్‌పేట్ వద్ద ఉన్న నాగార్జున పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి క్యాన్సర్‌తో ఇబ్బంది పడుతున్నది. విషయం తెలుసుకున్న పాఠశాల కరస్పాండెంట్ భరత్‌కుమార్, ప్రిన్సిపల్ భగవతి సోమవారం పాఠశాల విద్యార్థుల తరపున ఆర్థిక సాయం అందజేశారు.

- మెహిదీపట్నం

మెహిదీపట్నం సరోజిని దేవి కంటి ఆస్పత్రి ఆర్ఎంఓ డాక్టర్ నజాఫీబేగంను పెన్షనర్స్ అసోసియేషన్ వారు తెలుగు అకాడమీ ఆడిటోరియంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. గతంలో ఉస్మానియా ఆస్పత్రిలో, ప్రస్తుతం మెహిదీపట్నం సరోజినిదేవి కంటి ఆస్పత్రిలో ఆర్ఎంఓగా నజాఫీబేగం పనిచేస్తున్నారు.

- మెహిదీపట్నం

ఎమ్మెల్యే పర్యటన..

గోల్నాక డివిజన్ అన్నపూర్ణనగర్‌లో కలుషిత నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. బస్తీలో మంచినీరు కలుషితమై రావడం, లోప్రెషర్ సమస్యను తెలుసుకున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ సోమవారం ఉదయం అన్నపూర్ణనగర్‌లో పర్యటించారు. నీటి సరఫరా జరుగుతున్న తీరును గమనించారు. వీలైనంత తొందరలోనే సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

- అంబర్‌పేట

' విజయలక్ష్మి వేంకటేశ శతకం ' పుస్తకావిష్కరణ

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డా.మామిడి హరికృష్ణ, కొలకలూరి ఇనాక్

రవీంద్రభారతి, ఏప్రిల్ 22 : తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలంగాణ కవుల సంఘం – కళాసూర్య కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో కవి ప్రభుత్వ జూనియర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ జనువాడ రామస్వామి రచించిన 'విజయలక్ష్మి వేంకటేశ శతకం' పుస్తకావిష్కరణ సోమవారం రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో నిర్వహించారు. కార్యక్రమానికి వక్తలుగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ, వెంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ వైస్‌చాన్సలర్, పద్మశ్రీ కొలకలూరి ఇనాక్, కవి పండితులు సుధామ, విహారి, గిరిజామనోహర్‌బాబు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం డాక్టర్ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ కళాసూర్య సంస్థ 40 ఏండ్లుగా ప్రభాకరచారి కళాసేవ చేస్తున్నారన్నారు. కొలకలూరి ఇనాక్ ఆధ్వర్యంలో కవి సమ్మేళనం నిర్వహించారు.

మరోసారి ఆశీర్వదించండి

సికింద్రాబాద్ పార్లమెంట్‌ను అభివృద్ధి చేయడానికి మరోసారి అవకాశం కల్పించాలని పార్లమెంట్ అభ్యర్థి కిషన్‌రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా కాచిగూడ, లింగంపల్లి, బర్కత్‌పుర తదితర ప్రాంతాల్లో కాచిగూడ కార్పొరేటర్ ఉమా రమేశ్‌యాదవ్‌తో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కృష్ణయాదవ్, కన్నె రమేశ్‌యాదవ్, నందకిశోర్‌యాదవ్, ఎక్కాల కన్నా, పాల్గొన్నారు. - కాచిగూడ

నల్లకుంటలో జీపుయాత్ర

అంబర్‌పేట, ఏప్రిల్ 22 : సికింద్రాబాద్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి జి.కిషన్‌రెడ్డి సోమవారం నల్లకుంటలో డివిజన్‌లో జీపుయాత్ర నిర్వహించారు. మాజీ మంత్రి సి.కృష్ణాయాదవ్, కార్పొరేటర్ వై.అమృత, మాజీ కార్పొరేటర్ వనం రమేశ్‌లతో కలిసి ఫీవర్ దవాఖాన చౌరస్తా నుంచి యాత్ర ప్రారంభించి హిందీ మహా విద్యాలయం, ఓయూ చౌరస్తా, శివంరోడ్డు, టీఆర్టీ కాలనీ, నరసింహబస్తీ, న్యూరామాలయం బ్రాహ్మణ హాస్టల్, తిలక్ నగర్ మెయిన్‌రోడ్డు, బతుకమ్మ చౌరస్తా, పెద్ద గణేశ్, ఇందిరానగర్, చర్చిగల్లీ, గోల్నాక వెజిటేబుల్ మార్కెట్, భాగ్యనగర్, మహేశ్ పాన్ గల్లీ, శివానందనగర్, రత్నానగర్, సత్యానగర్ ప్రాంతాల్లో జీపుయాత్ర సాగింది. కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్యాంరాజు, కన్నె రమేశ్ యాదవ్, కేబీ.నర్సింగ్‌రావు, మధు యాదవ్, సురేశ్ యాదవ్, బుచ్చిరెడ్డి, మహేశ్, శ్రీనివాస్, గోపాల్, శ్రావణ్, ఎక్కాల కన్నా, పెంటం రాజు, అర్జున్ పాల్గొన్నారు.

లోప్రెషర్ పరిష్కారానికి కృషి

అంబర్‌పేట డివిజన్ రఘునాథ్‌నగర్‌లో కొన్నిరోజులుగా తాగునీరు లోప్రెషర్‌తో వస్తున్న విషయాన్ని తెలుసుకున్న కార్పొరేటర్ ఈ.విజయ్‌కుమార్‌గౌడ్ సోమవారం బస్తీలో పర్యటించి స్థానికులను అడిగి పరిస్థితిని పరిశీలించారు. సంబంధిత వాటర్ వర్క్స్ అధికారులతో మాట్లాడి.. వేసవిని దృష్టిలో పెట్టుకొని వీలైనంత త్వరగా నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.

- అంబర్‌పేట

స్పెషల్ రైల్‌లో చోరీ

కాచిగూడ, ఏప్రిల్ 22 : స్పెషల్ రైల్‌లో చోరీ జరిగింది. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప కథనం ప్రకారం.. మెదక్ జిల్లాకు చెందిన నరేశ్ స్పెషల్ రైల్‌లో నల్లగొండ మీదుగా ఆదివారం అర్ధరాత్రి కాచిగూడకు వస్తున్నాడు. నల్లగొండ రైల్వేస్టేషన్ సమీపంలో దుండగులు ఆయన బ్యాగులో ఉన్న 8 తులాల వెండి అభరణాలు, రూ.500 దొంగిలించుకుని పారిపోయారు. కాచిగూడ చేరుకున్న నరేశ్ సోమవారం రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తదుపరి విచారణ నిమిత్తం ఈ కేసును నల్లగొండ రైల్వే పోలీస్ స్టేషన్‌కు బదిలీబదిలీ చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ బీజీ ప్రసాద్‌రావు తెలిపారు.

గోల్కొండలో ఎంఐఎం ప్రచారం

మెహిదీపట్నం ఏప్రిల్ 22 : కార్వాన్ నియోజకవర్గం గోల్కొండ, టోలిచౌకి, లంగర్‌హౌస్ డివిజన్‌లలో హైదరాబాద్ ఎంఐఎం పార్టీ అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీ తరపున సోమవారం సాయంత్రం కార్వాన్ నియోజకవర్గం ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్ ప్రచారం నిర్వహించారు. నానల్‌నగర్ కార్పొరేటర్ ఎండీ.నసీరుద్దీన్, కార్పొరేటర్‌లు మహ్మద్ హరూన్ ఫర్హాన్, వజీ ఉజ్జమా సిద్ధికీ, అమీర్ పాల్గొన్నారు.

గుడిమల్కాపూర్‌లో ఇంద్రారెడ్డికి నివాళి

మెహిదీపట్నం, ఏప్రిల్ 22 : నాంపల్లి నియోజకవర్గంలోని గుడిమల్కాపూర్ పి.ఇంద్రారెడ్డి పూలమార్కెట్‌లో సోమవారం మాజీ హోంమంత్రి పి.ఇంద్రారెడ్డి వర్ధంతిని మార్కెట్ వ్యాపారుల సంఘం నాయకులు సామ మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంద్రారెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సామ మహేందర్‌రెడ్డితో పాటు బి.మహిపాల్ రెడ్డి, గోపాల్, కేజీఎన్ మహమూద్, కె.మధుసూదన్‌రెడ్డి, పాండు, జనార్దన్ రెడ్డి, నర్సింగ్ రావు, లింగారెడ్డి, రవీందర్ గౌడ్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న బైశాఖీ మేళా

సుల్తాన్‌బజార్, ఏప్రిల్ 22 : పంజాబీలకు బైశాఖీ మేళా ఎంతో ఉత్సాహాన్నిస్తుందని తెలంగాణ పంజాబీ సభ అధ్యక్షుడు ఎస్.రవీందర్ సింగ్ సర్నా అన్నారు. సోమవారం తెలంగాణ పంజాబీ సభ ఆధ్వర్యంలో నిర్వహించిన బైశాఖీ మేళాను, రూహ్ పంజాబ్ డీ వార్షిక మ్యాగజైన్‌ను రవీందర్ సింగ్ ఆవిష్కరించారు.

నేడే వీర హనుమాన్ విజయ యాత్ర

సుల్తాన్‌బజార్, ఏప్రిల్ 22 : ప్రతి యేడాది తరహాలోనే ఈ యేడాది కూడా వీర హనుమాన్ విజయ యాత్రను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు భజరంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ శివరాములు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గౌలిగూడలోని రామ్ మందిరంలో మంగళవారం ఉదయం 8:30 గంటలకు యజ్ఞం, ప్రత్యేక పూజలు ప్రారంభమవుతాయని అన్నారు. పూజల అనంతరం పది గంటలకు వీర హనుమాన్ విజయ యాత్రను ప్రారంభించనున్నట్లు తెలిపారు. రామ భక్తులు, హిందూ యువ సైనికులు, హిందూ శక్తి జాగరణ యాత్రలో లక్షలాదిగా పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. వీర హనుమాన్ విజయ యాత్ర ప్రతి సంవత్సరం తరహాలోనే సుమారు 13 కిలో మీటర్ల మేర కొనసాగుతుందని అన్నారు. ఈ యాత్ర గౌలిగూడ రామ్ మందిరం నుంచి ప్రారంభమై కోఠి ఆంధ్రాబ్యాంకు చౌరస్తా, కాచిగూడ వీర సావర్కర్ చౌరస్తా, నారాయణగూడ, ఆర్టీసీ క్రాస్ రోడ్, అశోక్ నగర్, మారియట్ హోటల్, బైబిల్ హౌజ్, మహంకాళీ మందిరం, ప్యారడైజ్ హోటల్ మీదుగా తాడ్‌బండ్ హనుమాన్ మందిరం వరకు కొనసాగుతుందని వివరించారు. వీర హనుమాన్ విజయ యాత్రకు ముఖ్య వక్తగా విశ్వ హిందూ పరిషత్ జాతీయ కార్యదర్శి, శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ బాధ్యులు శ్రీ గోపాల్‌జీ అయోధ్య నుంచి విచ్చేస్తున్నట్లు పేర్కొన్నారు.

శోభాయాత్రకు భారీ బందోబస్తు

చిక్కడపల్లి, ఏప్రిల్ 22 : హనుమాన్ జయంతి సందర్భంగా మంగళవారం నిర్వహించనున్న హనుమాన్ శోభాయాత్రకు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సోమవారం సెంట్రోల్ జోన్ డీసీపీ అకాంక్ష యాదవ్, చిక్కడపల్లి ఏసీపీ ఎల్.రమేశ్‌కుమార్, సీఐ సీతయ్య, ఇతర పోలీస్ అధికారులతో కలిసి శోభాయాత్ర వెళ్లే ఆర్టీసీ క్రాస్ రోడ్స్, చిక్కడపల్లి తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించి పరిశీలించారు. శోభాయాత్ర ప్రశాంతంగా జరిగేవిధంగా అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

వివేక్‌నగర్‌లో హనుమాన్ శోభాయాత్రకు ఏర్పాట్లు

చిక్కడపల్లి, ఏప్రిల్ 22 : చిక్కడపల్లి వివేక్‌నగర్‌లోని ప్రసిద్ధ శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో మంగళవారం హనుమాన్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయం కార్యనిర్వాహణాధికారి మాచర్ల దేవనాథం తెలిపారు. సోమవారం దేవాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హనుమాన్ జయంతి ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అర్చకులు బుగ్గాలక్ష్మీపతి శర్మ, అర్చకులు కె.కృష్ణమూర్తి, కందాల వెంకటాద్రి, ఎస్‌జీఎస్ ఆచార్య తదితరులు పాల్గొన్నారు.

28న డ్యాన్స్ ఫెస్ట్-2024

చిక్కడపల్లి, ఏప్రిల్ 22 : ఏప్రిల్ 29న వరల్డ్ డ్యాన్స్ డే ను పురస్కరించుకుని స్ఫూర్తి మ్యూజిక్, డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో 28న డ్యాన్స్ ఫెస్ట్-2024 నిర్వహిస్తున్నట్లు అకాడమీ డైరెక్టర్ సూర్యతేజ సుబ్రాంత్ మాస్టర్ తెలిపారు. కూచిపూడి, భరతనాట్యం, కథక్, పేరిణి నాట్యం, దేశభక్తి, జాన పద, సినిమా, వెస్టన్ డ్యాన్స్ కళాకారుల నాట్య ప్రతిభను ప్రోత్సహించేందుకు ఈ ఫెస్ట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 28న సాయంత్రం 6గంటలకు సుందరయ్య కళా నిలయంలో నిర్వహించనున్న ఈ డ్యాన్స్ ఫెస్టివల్‌లో 6 నుంచి 60 సంవత్సరాల వయస్సు గల వారు పాల్గొనవచ్చునని తెలిపారు. ఆసక్తిగలవారు 26వ తేదీలోపు 9963222040 నంబర్‌ను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

ఆకట్టుకున్న సంగీత నృత్య పోటీలు

పురస్కార గ్రహీతలతో ట్రెజరీ అండ్ అకౌంట్స్ డిప్యూటీ డైరెక్టర్ వసుంధర

ముషీరాబాద్, ఏప్రిల్ 22 : నవ్యనాటక సమితి ఆధ్వర్యంలో సోమవారం చిక్కడపల్లి త్యాగరాయగాన సభలో వీఎల్ సావిత్రి స్మారక లలిత సంగీత, నృత్య పోటీలు పలువురిని విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ట్రెజరీ అండ్ అకౌంట్స్ డిప్యూటీ డైరెక్టర్ జి.వసుంధర ముఖ్య అతిథిగా పాల్గొని గాయనీలు, నృత్యకారులను సత్కరించి జ్ఞాపికలు అందచేశారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లి లోకనాథశర్మ, ఆనందమోహన్, కలగా కృష్ణమోహన్, సురేఖ, శశికళ, వినోద్‌బాబు, ఫణీంద్ర, నవ్యనాటక సమితి అధ్యక్షుడు వేమరాజు విజయ్‌కుమార్, లవణరాజు, తదితరులు పాల్గొన్నారు.

24న నామినేషన్

అబిడ్స్, ఏప్రిల్ 22 : సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఈ నెల 24న నామినేషన్ దాఖలు చేయనున్నట్లు దానం నాగేందర్ తెలిపారు. నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్ సమీపంలోని బంగారు మైసమ్మ ఆలయంలో ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మెట్టు సాయికుమార్, బండ సూరి, సంతోష్ గుప్త, పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులు పూర్తి చేయండి

చెప్పల్‌బజార్ మజీద్ ప్రాంతంలో సోమవారం కాచిగూడ కార్పొరేటర్ ఉమాయాదవ్ పర్యటించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా డ్రైనేజీ పనులను పూర్తి చేయాలని జలమండలి అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కన్నె రమేశ్‌యాదవ్, సుభాష్‌పటేల్, సాయి, నాగరాజు, కిరణ్, సంతోష్, రవియాదవ్ పాల్గొన్నారు.

- కాచిగూడ

స్ట్రాంగ్‌రూంలో ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లు

ఈవీఎం, వీవీ ప్యాట్‌లను స్ట్రాంగ్ రూంలో భద్ర పరుస్తున్న హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఏఆర్ఓలు విక్టర్, విద్యాధర్

అబిడ్స్, ఏప్రిల్ 22 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం గోషామహల్ సెగ్మెంట్‌కు సంబంధించి ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లు కోఠి మహిళా విశ్వ విద్యాలయంలోని స్ట్రాంగ్‌రూంలో భద్ర పరిచారు. విక్టరీ ప్లే గ్రౌండ్స్ నుంచి 293 బ్యాలటింగ్ యూనిట్‌లు, 293 కంట్రోలింగ్ యూనిట్‌లు, 329 వీవీ ప్యాట్‌లు పోలీస్ బందోబస్తు మధ్య కోఠిలోని తెలంగాణ మహిళా విశ్వ విద్యాలయానికి చేరుకోగా అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు వి.విక్టర్, విద్యాధర్, పోలీస్ బందోబస్తు, రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో స్ట్రాంగ్ రూంలో భద్రపరిచి సీల్ వేశారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి విక్టర్ మాట్లాడుతూ గోషామహల్ సెగ్మెంట్‌లో ఇప్పటి వరకు 2,73,636 మొత్తం ఓట్లు ఉండగా 1,42,522 పురుషులు, 1,31,089 మహిళలు, 25 ఇతరులు ఉన్నారని, 235 పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ నిర్వహించనున్నట్లు వివరించారు.

PUBLIC NOTICE

As per the instructions from my client Mr. Basheer-Ul-Haq S/o. Mr. Mohammed Abdul Haq, the General public are hereby informed that one Mrs. Badarunnisa Begum W/o. Mr. Abdul Aziz gifted the below mentioned property by way of Gift (Hibanama) in favor of Madarsa-E-Jamia Arabia for the sole purpose of running a **madarsa/schoot** In spite of that some third parties are trying to alienate the same by suppressing real facts by falsely claiming as their personal property without there being any right & title. Therefore, all are informed that not to deal any transactions with the mentioned schedule of property in any manner whatsoever. In spite of this notice, if any person/s are entering into any sale transactions, they are doing at their sole risk and legal consequences arises thereof.

Schedule of property

All that the H.No.1-4-833 (Part) admeasuring 192.43 Sq.Yards or 160.89 Sq. Mtrs. situated at Musheerabad, Bakaram, Hyderabad and bounded by: North: House of Md. Basheer-ul-Haq, H. No. 1-4-833/A/1 South: Abdul Hafeez H. No. 1-4-714 East: 20 feet wide Road West: Abdul Hakheem H. No. 1-4-713/ 1/A

A. VISHNU VARDHANA REDDY
Hari Rao Lakkaraju ADVOCATES
Flat No. 101, Maruthi Nilayam
H.No.2-2-1105/22/A Tilak Nagar,
New Nallakunta, Hyderabad-500 044.
Mobile No: 98497